క్లుప్తంగా

పంచాయతీల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శులు

గూడెంకొత్తవీధి: పంచాయతీల అబివృద్ధికి కృషి చేస్తామని మండల పంచాయతీ కార్యదర్శు ల సంఘం నాయకుడు బాలకృష్ణ అన్నారు. పంచాయతీలకు చెందిన కార్యదర్శుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘాన్ని ఏర్పాటుచేసుకున్నారు. ఇందులో భాగంగా మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా బాలకృష్ణనను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

అధ్వాన దారితో అవస్థలు


కుమ్మరితోము రహదారి దుస్థితి

పాడేరు రూరల్: వంట్లమామిడి పంచాయతీ కుమ్మరితోము గ్రామ రహదారి అధ్వానంగా మారిందని గ్రామస్తులు శ్రీను, ఈశ్వరరావులు తెలిపారు. రహదారి రాళ్ల తేలి చిత్తడిగా మారి, ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

సమస్యలతో సహవాసం

- శిథిలావస్థలో మంగళపాలెం పాఠశాల
- వర్షం పడితే తరగతుల నిర్వహణ ప్రశ్నార్థకం
- విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


టెంట్‌లో తరగతుల నిర్వహణ


శిథిలావస్థలో పాఠశాల భవనం

గూడెంకొత్తవీధి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల భవనాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా పాఠశాలల దుస్థితిపై కనీసం దృష్టి సారించలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిల భవనాల్లోనే తరగతులు జరుగుతున్నాయి. వర్షం పడితే గదులన్నీ జలమయమవుతున్నాయి. ఇందులో భాగంగా దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాలు కురిస్తే గదులన్నీ వర్షపునీరు నిండిపోతుందని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థులు ఉండేందుకు ఇక్కట్లు తప్పడం లేదంటున్నారు. ఈ పరిస్థితుల్లో పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు భయపడుతున్నారని చెబుతున్నారు. వర్షం పడినపుడు పాఠశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కర్రలతో ఏర్పాటుచేసిన టార్పాలిన్లు కప్పి ఏర్పాటు గుడారంలో తరగతులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిల భవనంలోనే తరగతులు జరుగుతున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం దుస్థితిపై పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కానరాని ప్రహరీ

ముంచంగిపుట్టు: మండలంలోని దార్రెల పంచాయతీ చివుకుచింత జీపీఎస్ పాఠశాలకు గోడలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జల్లు విద్యార్థులపై కురుస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పాఠశాలకు గతంలో భవనం లేక పోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్, ఐటిడిఏ పీవో దృష్టికి తీసుకువెళ్లి విన్నవించడంతో అధికారులు పాఠశాలకు షెడ్‌ను నిర్మించారు. కానీ చుట్టు గోడలు నిర్మించడం మరిచారు. సోమవారం పీసా కమిటీ ఉపాధ్యక్షుడు సమరెడ్డి మురళీకృష్ణ, పాఠశాల చైర్మన్ కోడ మాధవరావులు పాఠశాలను సందర్శించారు. సుమారు 30 మంది విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు, బోధించేందుకు ఉపాధ్యాయులు పడుతున్న కష్టాలు గమనించి వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు గోడలు నిర్మించాలని, లేని పక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.


చివుకుచింతలో రేకుల షెడ్డులో తరగతులు నిర్వహణ

ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్‌గా రమణ

చింతపల్లి: చింతపలి ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్‌గా ఎ.రమణ నియమితులయ్యారు.ఇప్పటివరకూ ఇక్కడ విధులు నిర్వహించిన ప్రిన్సిపాల్‌కు విజయనగరం జిల్లా సాలూరుకు బదిలీ కాగా విశాఖపట్నం పాత పారిశ్రామిక శిక్షణ సంస్థలో విధులు నిర్వహిస్తున్న రమణను ఇక్కడ నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి హోమం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయంలోని ఆషాడ మాసం పంచమి తిథి సందర్భంగా సోమవారం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, వారాహి దేవికి హోమం నిర్వహించారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై వినతి

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ గెమ్మెలిబారు, చెరువుబంధ, బంగారుబుడ్డి గ్రామాల్లో గల ఆదివాసీ గిరిజన ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తక్షణమే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలని పీసా కమిటీ మండల అధ్యక్షుడు లకే రామకృష్ణ తెలిపారు. సొలభం పంచాయతీలో గెమ్మెలిబారు, చెరువుబంధ, బంగారుబుడ్డి గ్రామాల్లో ఆయన సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేక స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని ఆయన కోరారు. వివిధ సమస్యలపై గ్రామస్తులు ఇచ్చిన వినతులను జిల్లా, ఐటీడీఏ ఉన్నతాధికారులకు అందించి, సమస్యలు పరిష్కరించాలని కోరనున్నట్టు రామకృష్ణ తెలిపారు. పెద్దబ్బాయి, సోమేశ్వరరావు, గణేష్, సత్తిబాబు, నరసింగరావు, లక్ష్మి, కుంబో, మంగమ్మ, రాధిక తదితరులు పాల్గొన్నారు.


పీసా కమిటీ మండల అధ్యక్షుడు రామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆదివాసీ గిరిజనులు

రైతులకు విత్తనాల పంపిణీ

రంపచోడవరం: మారేడుమిల్లి మండలంలోని సున్నంపాడు రైతు సేవా కేంద్రంలో ఎంపీపీ సార్ల లలితకుమారి సోమవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో 230 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం ఉన్నట్టు చెప్పారు. ఎంపీటీసీ మడకం అనిల్‌కుమార్, సర్పంచ్ వెలుగూరి లచ్చిరెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ కర్నేంద్ర కుమార్, సుమతి, వినోద్ కుమార్, కూటమి నాయకుడు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు. ముసురుమిల్లిలో సర్పంచ్ కోసు రమేష్‌బాబుదొర, ఎంపీటీసీ కుంజం వంశీలు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. శేఖర్, చంద్రశేఖర్ తదతరులు పాల్గొన్నారు.


సున్నంపాడు రైతు సేవా కేంద్రం వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లలితా కుమారి

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ


అగ్ని ప్రమాద బాధితులకు సరకులు ఇస్తున్న నాయకులు

ఎటపాక: మండలంలోని జిన్నెగట్టు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం వితరణ అందజేశారు. బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలను పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము చేతుల మీదుగా అందించారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. నాయకులు నాగరాజు, శ్రీను, సత్తెమ్మ, శ్రీరాములు, ధర్మరాజు, లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఎరువులు, విత్తనాలు అందజేయాలి

రంపచోడవరం: గిరిజన రైతులకు ప్రస్తుత సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఉచితంగా అందజేయాలని కోరుతూ అఖిల భారత్ రైతు కూలీ సంఘం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన సదస్సులో న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు పి.టాన్యా మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా గిరిజన రైతులకు ప్రభుత్వం ఎటువంటి సంక్షేమాలు, ఎరువులు, విత్తనాలు అందజేయలేదన్నారు. ఏజెన్సీ గ్రామాల్లోని అన్ని మండలాల్లో రైతులను గుర్తించి రైతు పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలన్నారు. ఉపాధి పనులకు రోజు కూలీ రూ 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు దూలయ్య, లచ్చిరెడ్డి, అనసూయ, జోగమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామిగా జగన్నాథుడు

కశింకోట: దేవాదాయ శాఖకు చెందిన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని లక్ష్మీనృసింహస్వామిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణుమూర్తి దశావతారాల్లో భాగంగా ఉత్సవాల నాల్గో రోజు లక్ష్మీనృసింహస్వామిగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన, భక్తుల గోత్ర నామార్చనలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రామ చరణాచార్యులు తదితరులు కార్యక్రమాలను జరిపారు. మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. చివరిగా ప్రసాద వితరణ చేశారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి

నర్సీపట్నం : సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్ సోమవారం తనిఖీ చేశారు. జైల్‌లో అందుతున్న సౌకర్యాలపై జడ్జి ఖైదీలను ఆరా తీశారు. ఖైదీలకు తయారు చేసిన భోజనాన్ని తనిఖీ చేశారు. నిత్యావసర సరుకులను పరిశీలించారు. ఖైదీలకు మంచి భోజనాన్ని అందించాలని జైల్ సిబ్బందిని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చునని జడ్జి ఖైదీలకు సూచించారు.

గస్తీ కోసం ప్రత్యేక బైక్

పాయకరావుపేట: స్థానిక పోలీసు స్టేషన్‌లో నర్సీపట్నం ఎస్‌డీపీవో పి.శ్రీనివాసరావు ట్రాఫిక్ క్లియరెన్స్, గస్తీ కోసం సమకూర్చిన బైక్‌ను సోమవారం ప్రారంభించారు. స్థానిక స్టేషన్‌కు ప్రభుత్వం ఓ బైక్‌ను ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ క్లియరెన్స్, స్కూళ్ల వద్ద, రాత్రి సమయంలో గస్తీ కోసం ఈ బైక్‌ను వినియోగించనున్నట్టు ఎస్‌డీపీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.అప్పన్న, ఎస్‌ఐలు పురుషోత్తం, పి.గోవిందరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు సంబంధించి ఈ నెల 5వ తేదీలోగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

నిస్వార్థ సేవలతో సమాజంలో గుర్తింపు


మాచ్‌ఖండ్ జల విద్యుత్ ప్రాజెక్టులో రిటైరైన ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు


నెల్లిపూడిలో రిటైరైన టీచర్ వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

పాడేరు : ఐటీడీఏ కాఫీ సహాయ సంచాలకులు రూడి అప్పారావు ఉద్యోగ విరమణలో భాగంగా స్థానిక కాఫీ హౌస్ అతిథి గృహంలో సోమవారం ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు సహచారులతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాఫీ రైతులకు ఆయన అందించిన సేవలు ఎంతో అభినందనీయమన్నారు. నిస్వార్థ సేవలతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. సన్మాన గ్రహీత రూడి అప్పారావు మాట్లాడుతూ ఐటీడీఏ కాఫీ విభాగంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఐటీడీఏ పరిపాలన అధికారి హేమలత, పీహెచ్‌ఓ రాజశేఖర్, అధికారులు శ్రీనివాస్, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పాడేరు ఐటీడీఏ కాఫీ శాఖ ఆధ్వర్యంలో మండల హెచ్‌వో, కాఫీ ఏడీ(ఎఫ్ఏసీ)గా పనిచేసిన రూడి అప్పారావు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో కాఫీ శాఖ సిబ్బంది నిర్వహించిన వీడ్కోలు సభ కార్యక్రమంలో అప్పారావు దంపతులను ఘనంగా సత్కరించారు. మండలంలో కాఫీ తోటల అభివృద్ధికి గిరిజన రైతులను ప్రోత్సహించి, అందరి మన్ననలు పొందిన అప్పారావు గిరిజన కాఫీ రైతులకు అందించిన సేవలు మరువలేనివని లైజన్ వర్కర్లు యూనియన్ నాయకులు చెప్పారు. అప్పారావు దంపతులను సహచర సిబ్బంది ఘనంగా సన్మానించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల్ విద్యుత్ కేంద్రంలో ఫోర్‌మెన్‌లుగా పనిచేసిన ఎం.వీరస్వామి, మోహన్‌లాలు ఉద్యోగ విరమణ కావడంతో ప్రాజెక్టు ఉద్యోగులు సన్మాన సభను నిర్వహించారు. ఆయా ఉద్యోగుల దంపతులను ప్రాజెక్టు ఈఈ జనరేషన్ బి.గోవిందరాజు, సిబ్బంది ఘ నంగా సన్మానించారు. ఆయా ఉద్యోగుల పనితీరును కొనియాడారు. ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గంగవరం: నెల్లిపూడి ఎంపీ యూపీ స్కూలు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన ద్వారపూడి వెంకటేశ్వర్లు వీడ్కోలు సభను హెచ్ఎం హేమకుమారి అధ్యక్షతన నిర్వహించారు. నెల్లిపూడి సర్పంచ్ పి.రమణమ్మ, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, ఎంఈవో–2 టి.మల్లేశ్వరరావు తదతరులు వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సత్కరించారు. విద్యాభివృద్ధికి వెంకటేశ్వర్లు మాస్టరు చేసిన సేవలను పలువురు కొనియాడారు.పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సుధా, వైఎస్సార్ సీపీ నాయకుడు బాబ్జి , సినీ డైరెక్టర్ ద్వారపూడి సత్యంయూటీఎఫ్ ప్రతినిధుల రఘుబాబు, రాంబాబు, నాయకులు వెంకన్న దొర , చెన్నారెడ్డి, రాంబాబు దొర, భగవాన్ పాల్గొన్నారు.



కాఫీ సహాయ సంచాలకులు రూడీ అప్పారావు దంపతులను పాడేరు, జి.మాడుగులలో సన్మానిస్తున్న ఐటీడీఏ అధికారులు, వెంకటేశ్వరరావు తదితరులు

నేడు అమ్మవారి పండగ

మాడుగుల రూరల్ : ముకుందపురం గ్రామంలో మంగళవారం పైడితల్లమ్మ పండగ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీ అని సర్పంచ్ కర్రి గణేష్ సోమవారం తెలిపారు. ఈ పండగ సందర్భంగా ఈ నెల 27వ తేదీన అమ్మవారి ఘటాలు గ్రామంలో ప్రారంభించారు.